@netifocusnews @focustv www.netifocusnews.com
TS-18-0006625
FOCUS TELUGU TV అనునిత్యం - ప్రజాపక్షం
నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
COMPLIMENTARY COPY
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | ఆదివారం 31, మార్చి 2024 | పేజీలు: 04

## పీవీ నరసింహారావుకి
# భారతరత్న



- పీవీ తరపున స్వీకరించిన కుమారుడు ప్రభాకర్ రావు
- దేశ అత్యున్నత పురస్కారాన్ని ప్రదానం చేసిన రాష్ట్రపతి
- మరో ముగ్గురికీ ప్రదానం.. స్వీకరించిన కుటుంబీకులు
- నేడు అడ్వాణీకి ఆయన నివాసంలో అందజేత
- పీవీ సేవలను దేశ ప్రజలంతా గౌరవిస్తారు: ప్రధాని మోదీ

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మార్చి 30:**

రాష్ట్రపతి భవన్‌లోని దర్బార్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భారతరత్న పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ప్రదానం చేశారు. మాజీ ఉపప్రధాని ఎల్‌కే అద్వాణీకి గత ఫిబ్రవరిలో కేంద్రం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించింది. అలాగే బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్, మాజీ ప్రధాన మంత్రులు పీవీ నర్సింహారావు, చౌదరీ చరణ్ సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు మరణానంతరం దేశ అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించింది. పీవీ తరపున ఆయన కుమారుడు ప్రభాకర్‌రావు భారతరత్నను స్వీకరించారు. చరణ్ సింగ్ తరపున ఆయన మనుమడు జయంత్ సింగ్, ఎంఎస్ స్వామినాథన్ తరపున ఆయన కుమార్తె నిత్యారావు, కర్పూరీ ఠాకూర్ తరపున ఆయన కుమారుడు రామ్‌నాథ్ పురస్కారాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ, ఉప రాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్ , కేంద్రమంత్రులు అమిత్ షా, జైశంకర్, కిషన్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తదితరులు పాల్గొన్నారు. ఎల్‌కే అద్వానీకి ఆదివారం ఆయన నివాసంలో రాష్ట్రపతి ముర్ము భారతరత్నను ప్రధానం చేయనున్నారు. ఉపరాష్ట్రపతి, ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు ఈ కార్యక్రమానికి మిగతా 2లో..



## విద్యుత్, తాగునీటి సరఫరాపై చర్యలు
# తీసుకోవాలి

### వేసవి దృష్ట్యా గ్రామాల వారీగా తాగునీటికి యాక్షన్‌ప్లాన్ రూపొందించాలి..
### సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం..



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, మార్చి 30:**

రాష్ట్రంలో విద్యుత్తు వినియోగం పెరుగుతున్నందున అంతరాయం లేకుండా సరఫరా చేయడంపై దృష్టి సారించాలని, తాగు నీటికి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్తును అందించేందుకు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. కరెంటు పోయిందనే ఫిర్యాదు రాకుండా చూసుకోవాలని, ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించాలన్నారు. సచివాలయంలో శనివారం విద్యుత్తు, తాగునీటి సరఫరాపై ఆయన సమీక్ష నిర్వహించారు. మిగతా 2లో..



## బీసీ సంక్షేమంపై
# చర్చకు సిద్ధమా

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పొన్నం సవాల్

వివరాలు 02లో..

# నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



వివరాలు 02లో..

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
# పొలంబాట

### నేడు జనగామ, సూర్యాపేట, నల్లగొండలో పర్యటన
### ఎండిన పంటలను పరిశీలించనున్న మాజీ సీఎం కేసీఆర్..



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, మార్చి 30:**

సాగు నీటి సమస్య వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకునేందుకు మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం పొలం బాట పట్టనున్నారు. జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల పరిధిలో నీరు లేక ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడనున్నారు. రైతుల ఇబ్బందులను తెలుసుకుని వారికి భరోసా కల్పించేలా ఈ యాత్ర ఉంటుందని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫామ్ హౌస్ నుంచి కేసీఆర్ ఆదివారం ఉదయం 8:30కు బయలుదేరుతారు. మిగతా 2లో..

## జగన్ దుర్మార్గ పాలనను
# అంతం చేయాలి

- అందుకే కలసి పోటీ చేస్తున్నాం
- ఆదరిస్తే అభివృద్ధికి బాటలు వేస్తా
- పిఠాపురం సభలో పవన్ కళ్యాణ్ పిలుపు
- భారీగా తరలివచ్చిన ప్రజలు



వివరాలు 02లో..



2

## కేటీఆర్‌పై క్రిమినల్ కేసు

నిత్య నూతనంగా వెలువడుతూ..
నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
సంచలన వార్తా కథనాలతో నిత్యం విశేష పాఠకాధరణ పొందుతున్న, నేటి ఫోకస్ న్యూస్ డిజిటల్ తెలుగు దిన పత్రికకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారిగా, నియోజకవర్గాల వారిగా, మండలాల వారిగా, మండలాల వారిగా బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, విలేకరులు కావలెలను.
ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్‌కు సంప్రదించగలరు.
9848488596

# జగన్ దుర్మార్గ పాలనను అంతం చేయాలి

**నేటి ఫోకస్ న్యూస్, పిఠాపురం-మార్చి30:**
జగన్ దుర్మార్గమైన పాలనను అంతం చేయడానికే తెదేపా, భాజపా, జనసేన కలిశాయని పవన్ కల్యాణ్ అన్నారు. తాను పోటీ చేస్తున్న పిఠాపురం నియోజకవర్గం నుంచి శనివారం జనసేనాని ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. తన కోసం సీటు త్యాగం చేసిన తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్మకు ధన్యవాదాలు తెలిపారు. పిఠాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా మీరంతా నాతో కలసి నడవండని పిలుపునిచ్చారు. ఇక్కడి నుంచి పోటీ చేస్తానని కలలో కూడా అనుకోలేదు. అధికారంలోకి రాగానే ఆసుపత్రులన్నీ బాగు చేస్తాం. నా సన్నిహితులతో మాట్లాడి పిఠాపురంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పెట్టిస్తా. ఓడినా దశాబ్దం నుంచి ఒంటరి పోరాటం చేస్తున్నా. పిఠాపురంలో ఇల్లు కట్టుకుంటా. అన్ని మతాలు, విశిష్ఠత కలిగిన నేల ఇది. నన్ను ఓడించడానికి చిత్తూరు జిల్లా నుంచి మిథున్‌రెడ్డి వచ్చారు. మండలానికి ఓ నాయకుడిని పెట్టారు. రూ.వందల కోట్లు ఖర్చు పెట్టేందుకు సిద్ధమయ్యారు. వైకాపా వ్యతిరేక ఓటు చీలనివ్వకూడదనే కూటమిగా వచ్చాం. కూటమి కావాలో.. వైకాపా కావాలో.. ఆలోచించుకోండి అన్నారు. మద్యం ఆదాయంలో రోజుకు రూ.24 కోట్లు జగన్‌కే వెళ్తున్నాయని ఆరోపించారు జనసేన అధినేత పవన్ ఎన్నికల ప్రచార యాత్రలో భాగంగా శనివారం పిఠాపురం చేరుకున్నారు. గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన హెలి ప్యాడ్ లో ల్యాండ్ అయ్యారు. పవన్ ను చూసేందుకు జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వచ్చారు. పవన్ కు కాకినాడ ఎంపి అభ్యర్థి తంగేళ్ళ ఉదయ్ శ్రీనివాస్,కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, మాధురి నాయుడు, డాక్టర్ పిల్లా శ్రీధర్,వర్మ తనయుడు గిరీష్ లు స్వాగతం పలికారు. అనంతరం పవన్ కారులోంచి అభివాదం చేశారు. అనంతరం రోడ్డు మార్గంలో గొల్లప్రోలు నుంచి పి దొంతమూరు గ్రామంలోని మాజీ ఎమ్మెల్యే టిడిపి ఇన్చార్జ్ వర్మ నివాసానికి వెళ్ళారు. ఈ క్రమంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు ఎన్నికల ప్రచారంలో తొలిరోజే చేదు అనుభవం ఎదురైంది. శ్రీపాద క్షేత్రంలో పవన్ కళ్యాణ్ వారాహి వాహనం పూజలకు అనుమతి లభించలేదు. పురుహూతిక అమ్మవారి ఆలయంలో పవన్ ప్రచార వాహనానికి పూజలు రద్దు చేశారు. నిర్ణీత గడువులోగా ప్రచార వాహనం వారాహికి అనుమతి కోసం దరఖాస్తు చేసుకోలేదని పోలీసుల వాదనగా ఉంది. పవన్ బహిరంగ సభ ఉండటంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున సభకు తరలివచ్చారు. న్నికల ప్రచార పర్యటనలో భాగంగా మాజీ ఎమ్మెల్యే, నియోజక వర్గ టిడిపి ఇంచార్జీ వర్మ ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గొల్లప్రోలు నుంచి పి. దొంతమూరు వరకూ జనసైనికులు పవన్ కు ఘన స్వాగతం పలికారు. జనసేన, టిడిపి శ్రేణులతో పవన్ కళ్యాణ్ మాట్లాడారు. టీడీపీ నేత వర్మ కుటుంబ సభ్యులు పవన్ ను సత్కరించారు. ఆయన మాతృమూర్తి అలివేలు మంగ పద్మావతి నుంచి పవన్ కళ్యాణ్ ఆశీర్వాదం తీసుకున్నారు. అదే సమయంలో వర్మని, సుజయ్ కృష్ణ రంగారావుని పవన్ కళ్యాణ్ సత్కరించారు. తొలి విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా పవన్ పిఠాపురంలో 5 రోజులు పర్యటించనున్నారు. మార్చి 30 నుంచి ఏప్రిల్ 2 వరకు సొంత నియోజకవర్గం పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ప్రచారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఏప్రిల్ 3న జనసేన కీలక నేత నాదెండ్ల మనోహర్ పోటీ చేస్తున్న తెనాలిలో పవన్ ప్రచారం చేస్తారు. తొలి విడతలోనే అనకాపల్లి, కాకినాడ రూరల్ లో పవన్ క్యాంపెయిన్ చేయనున్నారు. ఏప్రిల్ 9న మరోసారి పిఠాపురంలో పవన్ ప్రచారం చేయడానికి ప్లాన్ చేశారు.

# కేటీఆర్‌పై క్రిమినల్ కేసు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి30:**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. సీఎం రేవంత్ రెడ్డి రూ. 2500 కోట్లు వసూలు చేసి కాంగ్రెస్ పెద్దలకు పంపారంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై హనుమకొండ పోలీసులకు కాంగ్రెస్ నేత బత్తిన శ్రీనివాస్ రావు ఫిర్యాదు చేశారు. అయితే హనుమకొండ పోలీసులు ఆ కేసును బంజారా హిల్స్ స్టేషన్‌కు అక్కడి పోలీసులు బదిలీ చేశారు. కేటీఆర్‌పై బంజారాహిల్స్ పోలీసులు ఐపీసీ 504,505(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాజాగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ భవన్‌లో జరిగిన సికింద్రాబాద్ లోక్?సభ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమా? బీజేపీ ప్రభుత్వమా? అని అర్థం కావడం లేదన్నారు. సామంత రాజులా రేవంత్ ఢిల్లీకి రూ.2500 కోట్లు కప్పం కట్టారని ఆరోపించారు. దీనికోసం ఆయన అందరినీ బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి.

## మెదక్ అభ్యర్థి రఘునందన్‌పై చింతా ఫిర్యాదు

**నేటి ఫోకస్ న్యూస్, మెదక్-మార్చి30:** బీజేపీ మెదక్ లోక్‌సభ అభ్యర్థి రఘునందన్‌రావుపై ఎన్నికల కమిషన్‌కు ఎమ్మెల్యే చింత్రా ప్రభాకర్ శనివారం ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిలపై చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఈసీ కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ రఘునందన్ రావుపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. పరుష పదజాలంతో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఎన్నికల ప్రధాన అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట కాసాల బుచ్చిరెడ్డి ఉన్నారు.

# విద్యుత్, తాగునీటి సరఫరాపై చర్యలు తీసుకోవాలి



(మొదటి పేజీ తరువాయి..)
రాష్ట్రంలో సగటున 9,712 మెగావాట్ల డిమాండ్ ఉంటుందని, రెండు వారాలుగా 14,000-15,000 మెగావాట్ల మధ్య నమోదవుతోందని విద్యుత్తు అధికారులు తెలిపారు. ఏప్రిల్ నెల రెండో వారం వరకు ఇంచుమించుగా ఇదే స్థాయిలో డిమాండ్ ఉంటుందని నివేదించారు. గత ఏడాది జనవరి నుంచి మార్చి వరకు సగటున రోజుకు 239.19 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఉండగా... 2024 జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల్లో రోజుకు సగటున 251.59మిలియన్ యూనిట్ల వినియోగం నమోదైందని వెల్లడించారు.

గత ఏడాది(2023) మార్చి 14న 297.89 మిలియన్ యూనిట్ల వినియోగం అత్యధిక రికార్డు కాగా.. ఈ ఏడాది 308.54 మిలియన్ యూనిట్లతో కొత్త రికార్డు నమోదైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఈ సారి విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్నందున అధికారులందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. పీక్ డిమాండ్ ఉన్నప్పటికీ కోతల్లేకుండా విద్యుత్తును అందించడంలో డిస్కమ్‌లు సమర్థవంతమైన పాత్ర పోషించాయని పేర్కొంటూ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను అభినందించారు. వేసవి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఇబ్బంది తలెత్తకుండా చూడాలని చెప్పారు. తాగునీటి విషయంలోనూ యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఏప్రిల్, మే, జూన్ వరకు స్థానికంగా ఉన్న బోర్‌వెల్స్, బావులన్నింటినీ తాగునీటి అవసరాలకు వాడుకోవాలని సూచించారు. తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా కలెక్టర్లు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. సమస్య ఉన్న చోట తక్షణ పరిష్కారం చూపడానికి వీలుగా జిల్లా స్థాయిలో ఒక సీనియర్ అధికారిని నియమించాలని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో గ్రామాల వారీగా తాగు నీటి యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని చెప్పారు. అవసరాన్ని బట్టి సంబంధిత శాఖలకు చెందిన రాష్ట్ర స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో తాగునీటి కొరతను అధిగమించేందుకు వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

**చత్తీస్‌గఢ్‌లో స్టార్ క్యాంపెయినర్‌గా..**
చత్తీసగఢ్ లోక్‌సభ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరించనున్నారు. తెలంగాణ సీఎం సహా 40 మంది నేతలతో కూడిన స్టార్ క్యాంపెయినర్ల జాబితాను చత్తీసగఢ్ కాంగ్రెస్ పార్టీ శనివారం ప్రకటించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కర్ణాటక సీఎం సిద్దరామయ్య, హిమాచల్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు, పార్టీ చత్తీసగఢ్ ఇన్‌చార్జి సచిన్ పైలెట్, మాజీ విద్యార్థి నేత కన్హయ్య కుమార్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు.

# పీవీ నరసింహారావుకు భారతరత్న

(మొదటి పేజీ తరువాయి..)
హాజరుకానున్నారు. పీవీ తరపున పురస్కారాన్ని అందుకున్న అనంతరం ప్రధాని మోదీకి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ప్రభాకార్ రావు ధన్యవాదాలు తెలిపారు. తన తండ్రి పీవీ నర్సింహారావుకు భారతరత్న ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని కొడుకు ప్రభాకర్‌రావు, కూతురు శారదా దేవి తెలిపారు. దేశానికి పీవీ చేసిన సేవలను గుర్తించిన కేంద్రప్రభుత్వం అవార్డును ప్రకటించిందని అన్నారు. పీవీ చేపట్టిన సంస్కరణలను ఇప్పటికీ కేంద్రప్రభుత్వం అమలు చేస్తోందని వారు పేర్కొన్నారు. దేశ అభ్యున్నతిలో కీలక పాత్ర పోషించిన మహనీయులను భారతరత్నతో సత్కరించుకోవడం గర్వంగా ఉందని తెలంగాణ హైకోర్టు జడ్జి ఎన్వీ శ్రవణ్ కుమార్ అన్నారు.

**పీవీ సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి: మోదీ**
రాష్ట్రపతి చేతుల మీదుగా భారతరత్న అందుకున్న వారి సేవలను ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పశంసించారు. పీవీ దేశానికి చేసిన సేవలను భారతీయులందరూ గౌరవిస్తారని, ఆయనకు భారతరత్న దక్కినందుకు తనకు గర్వంగా ఉందని పేర్కొన్నారు. దేశ పురోగతికి పీవీ అవిరళ కృషి చేశారని, ఆయన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని మోదీ పేర్కొన్నారు. భారతదేశ అభివృద్ధికి, ముఖ్యంగా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిలో చౌదరీ చరణ్‌సింగ్ చేసిన కృషికి గుర్తింపుగా భారతరత్న లభించిందని చెప్పారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న తగిన నివాళి అని అన్నారు. ఎంఎస్ స్వామినాథన్ గురించి ప్రస్తావిస్తూ.. జన్యు, వ్యవసాయ శాస్త్ర రంగంలో ప్రపంచంలోనే గౌరవింపదగిన వ్యక్తి స్వామినాథన్ అని పేర్కొన్నారు. ఆయన కృషి వల్ల దేశం ఆకలిబాధల నుంచి బయటపడి ఆహార ఉత్పత్తిలో స్వయం సమృద్ధి వైపు నడిపించిందని కొనియాడారు. ఆయనకు లభించిన భారతరత్న పురస్కారం ద్వారా వ్యవసాయం, ఆహారభద్రతపై పరిశోధనలు చేసేలా మరింత మందికి ప్రేరణ లభిస్తుందని చెప్పారు. దేశంలో ఆర్థిక సంస్కరణలకు బాటలు వేసిన మహనీయుడు పీవీ అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు.

# కేసీఆర్ 'పొలం బాట'

(మొదటి పేజీ తరువాయి..)
10:30కు జనగామ జిల్లా దేవరుప్పులలోని ధరావత్ తండాకు చేరుకుంటారు. అక్కడ ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడతారు. 11:30కు సూర్యాపేట జిల్లా తుంగతుర్తి, అరవపల్లి, సూర్యాపేట గ్రామీణ మండలాల పరిధిలో ఎండిపోయిన పంటలను పరిశీలిస్తారు. మధ్యాహ్నం ఒంటిగంటకు సూర్యాపేట గ్రామీ ణ మండలంలో బయలుదేరి 1:30కు సూర్యాపేట నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. 2 గంటలకు అక్కడ భోజనం చేస్తారు. 3 గంటలకు విలేకరుల సమావేశం నిర్వహిస్తారు. 3:30 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి 4:30 గంటలకు నల్లగొండ జిల్లా నిడమానూరు మండలం చేరుకుంటారు. అక్కడ ఎండిపోయిన పంటలను పరిశీలిస్తారు. అనంతరం కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్‌కు బయలుదేరుతారు.

# పెళ్ళింట తీరని విషాదం

- పారాణి ఆరకముందే నవవధువు మృతి

**నేటి ఫోకస్ న్యూస్, పార్వతీపురం-మార్చి30:**
పెళ్ళైంది.. ఇక తన భర్తతో సంసార జీవితం గడపాలనుకుంది. కానీ కాళ్లపారాణి ఆరకముందే ఆ నవ వధువు మృతి చెందింది. ఈ విషాద ఘటన పార్వతీపురం మన్యం జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం దబ్బగడ్డ గ్రామానికి చెందిన నవ వధువు అఖిల(20)కు శుక్రవారం రాత్రి 10 గంటలకు వివాహమైంది. ఇక కుటుంబ సభ్యులందరూ అందరూ వెళ్లిపోయారు. పెళ్లి పక్రియ ముగిసిన తర్వాత నీరసంగా ఉందని చెప్పి అఖిల నిద్రలోకి జారుకుంది. కాసేపటికి ఆమెను బంధువులు పిలిచారు. కానీ స్పందించలేదు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన మక్కువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడ్నుంచి సాలూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అఖిలను పరీక్షించిన వైద్యులు అప్పటికే నవ వధువు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో వరుడితో పాటు ఆమె కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. నవ వధువు మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# బీసీ సంక్షేమంపై చర్చకు సిద్ధమా

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి30:**
భారాస పాలనలో బడుగు, బలహీన వర్గాలకు ఏం న్యాయం చేశారో కేటీఆర్ చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలో ఉండగా మీరే అన్ని ముఖ్యమైన పదవులు చేపట్టి.. ఇప్పుడు కల్లబొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు. బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక కులగణన చేపట్టామన్నారు. భారాస పాలనలో జరిగిన మోసాలన్నీ ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన మోసాలు అన్ని బయటకు రావడంతో ఆ పార్టీ నేతలు అయోమయంలో పడ్డారని ప్రభాకర్ అన్నారు. శనివారం నాడు గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... గత కేసీఆర్ పాలనలో బడుగు బలహీన వర్గాలకు ఏమి న్యాయం చేశారో మాజీ మంత్రి కేటీఆర్ చెప్పాలని ప్రశ్నించారు. మీరే అన్ని ముఖ్యమైన పదవులు చేపట్టి కల్లబొల్లి మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బలహీన వర్గాలకు ఏమి చేశారో బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే కేవలం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. కాంగ్రెస్ అధికారం వచ్చాక కులగణన చేపట్టామని తెలిపారు. 16 కులాలకు కార్పొరేషన్లు కేటాయించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో బలహీన వర్గాలకు అన్యాయం జరిగితే అడిగే స్వేచ్ఛ తమకుందని చెప్పారు. 23 ఏళ్లలో బీఆర్ఎస్‌లో బలహీన వర్గాలకు ఏ ఒక్కరికి న్యాయం చేయలేదన్నారు. బీజేపీ బలహీన వర్గాల వ్యక్తిని అధ్యక్ష పదవి నుంచి తొలగించి కిషన్ రెడ్డికి ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ నేతలపై విమర్శలు చేసే ముందు కేటీఆర్ వాళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

# నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి30:**
భారాస నేతలు అయోమయంలో ఉన్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆ పార్టీని వీడేందుకు సిద్ధమైన ఆయన తదుపరి కార్యాచరణపై దృష్టి సారించారు. కాంగ్రెస్ ఆహ్వానం నేపథ్యంలో ఆ పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు కుమార్తె కావ్యతో కలిసి మంత్రుల నివాస ప్రాంగణంలో తన అనుచరులతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ నేతలు తనను పార్టీలోకి ఆహ్వానించారని, రెండ్రోజుల్లో నిర్ణయం ప్రకటిస్తానని చెప్పినట్టు తెలిపారు. కడియం ఏ నిర్ణయం తీసుకున్నా మద్దతిస్తామని ఆయన అనుచరులు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా భారాస బలహీనపడిందన్న కడియం.. పార్టీ నేతల నుంచి సహకారం లభించలేదని తెలిపారు. ఓడిపోయే పార్టీ నుంచి పోటీ వద్దని కావ్య అనుకున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేయమని పిలుపు వచ్చిందని, అందరి అభిప్రాయం మేరకు నిర్ణయం ఉంటుందన్నారు. ఆరూరి రమేష్ వద్దంటేనే కావ్యకు



టికెట్ ఇచ్చారని చెప్పారు. తనను విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదన్న ఆయన.. కావ్యను నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి కీలక ప్రకటన చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ కార్యకర్తలతో కడియం శ్రీహరి శనివారం నాడు సమావేశం అయ్యారు. పార్టీ మారుదామా వద్దా అని కార్యకర్తలను కడియం అడిగారు. బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోలేమని కడియంకు కార్యకర్తలు చెప్పారు. మీరు ఏ నిర్ణయం తీసుకున్నా మీ వెంటే ఉంటామని ఏక వాక్య తీర్మానాన్ని కడియం శ్రీహరి అనుచరులు చేశారు. అయితే కార్యకర్తల నిర్ణయాన్ని బట్టి తాను నడుస్తానని కడియం తెలిపారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ.. తాను పార్టీ మారుతున్నానంటే బీఆర్ఎస్ పార్టీకి భయమెందుకని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు పసునూరి దయాకర్, ఆరూరి రమేష్ పార్టీ మారితే లేని అభ్యంతరం తన విషయంలో ఎందుకని నిలదీశారు. తన రాజకీయ జీవితంలో ఒక్క అవినీతి ఆరోపణ లేదని చెప్పారు. తనపై ఒక్క పెట్టి కేసు కూడా లేదన్నారు. తన కుమార్తె కడియం కావ్యకు ఎంపీ టిక్కెట్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని తెలిపారు. ఉద్యమ కారులకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసిందేమీ లేదన్నారు. తనకు వచ్చిన అవకాశాన్ని నియోజకవర్గ అభివృద్ధి కోసం ఉపయోగిస్తానని తెలిపారు. జిల్లాల్లో పక్క

నియోజకవర్గాల్లో అభివృద్ధి జరిగిందని.. ఒక్క స్టేషన్ ఘన్‌పూర్ మాత్రమే వెనుకపడిందని కడియం శ్రీహరి అన్నారు. అలాగే బీఆర్ఎస్‌పై కడియం కావ్య తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నేతలు దందాలు ఎక్కువ చేస్తుంటారని ఆరోపించారు. పార్టీ మారక ముందే తమపై విమర్శలు చేస్తున్నారన్నారు. రాజయ్య ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తాము ప్రతిపక్షంలో ఉన్నట్లుండేదని చెప్పారు. ఇప్పుడు కూడా అధికారులు తమ మాట వినడం లేదని కావ్య తెలిపారు. ఎన్ని రోజులు ఈ పరిస్థితి అని కడియం శ్రీహరి ఆలోచించారని పేర్కొన్నారు. అందుకే కడియం శ్రీహరి సమక్షంలోనే బీఆర్ఎస్‌పై కావ్య విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ నుంచి వచ్చిన ఆహ్వానంపై సమాలోచనలు జరిపామని తెలిపారు. గత కొంతకాలంగా పార్టీలో నాయకుల మధ్య వచ్చిన విభేదాల కారణంగానే తాము పార్టీ వీడేందుకు సిద్దమైనట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తే తనను గెలిపించే వాతావరణం ఇక్కడ లేదని అయినా పార్టీ టికెట్ ఇస్తే పోటీ చేసేందుకు సిద్దపడినట్లు పేర్కొన్నారు. తమకు ఎవరూ మద్దతు ఇచ్చే పరిస్థితులు లేని కారణంగానే పోటీ నుంచి తప్పుకున్నట్లు వివరించారు. ఈ విభేదాలు, నాయకుల మధ్య సమన్వయ లోపమే బీఆర్ఎస్ ప్రతిష్ఠను దిగజారుస్తోందని తెలిపారు. తమ నియోజకవర్గాన్నికి ఈ మధ్య కాలంలోనే మాజీ మంత్రి హరీష్ రావు వచ్చినటప్పుడు కూడా సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపించిందన్నారు.

# గులాబీ బాస్‌కు వరుస షాక్‌లు

- కాంగ్రెస్‌లో చేరిన మేయర్ విజయలక్ష్మి
- మాజీ ఎమ్మెల్సీ పురణం సతీష్
- గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్న అంబర్‌పేట ఎమ్మెల్యే

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి30:**

గులాబీ బాస్ కేసీఆర్‌కు కాంగ్రెస్ పార్టీ కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. గేట్లు ఓపెన్ చేశామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల తర్వాత.. బీఆర్ఎస్ నేతలు హస్తం పార్టీలోకి క్యూ కడుతున్నారు. గత పదేళ్లుగా కేసీఆర్ వెంట నడిచిన నాయకులు పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీల్లో చేరుతున్నారు. ఇప్పటికే కే కేశవరావు, కడియం శ్రీహరి వంటి వారు బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పగా.. తాజాగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కారు పార్టీని వీడతారంటూ ప్రచారం జరుగుతోంది. ఇలా లోక్ సభ ఎన్నికల వేళ బీఆర్ఎస్ గట్టి షాక్ తగిలింది. జీహెచ్ఎంసీ మేయర్ జి.విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి ఆమెను పార్టీలోకి ఆహ్వానించారు. దీపాదాస్ మున్షీ సమక్షంలో మాఎ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మరోవైపు రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు, భారాస స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య కూడా హస్తం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. త్వరలోనే వీరు పార్టీలో చేరనున్నట్లు సమాచారం. అంతకుముందు మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరికలు జోరుగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ఇంచార్జ్ దీపాదాస్ మున్షి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హస్తం కండువా కప్పి ఆమె పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్.. దీపాదాస్ మున్షి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ జాయిన్ అయ్యారు. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, రాజ్యసభ ఎంపీ కె కేశవరావు కూడా రోజు కాంగ్రెస్ లో చేరనున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ ను వీడుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇక, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా పార్టీకి గుడ్ బై చెప్పనున్నారు. కడియం కూతరు వరంగల్ బీఆర్ఎస్ ఎంపీగా పోటీ చేయలేనని తప్పుకున్న సంగతి తెలిసిందే. ఇకపోతే అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎక్కువమంది గెలిచారు. దీంతో గ్రేటర్ పరిధిలో ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం ద్వారా రానున్న లోక్‌సభతో పాటు.. కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపొందచ్చనే అంచనాలో హస్తం పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. కీసరలోని ఓ ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గం నేతలతో కాలేరు వెంకటేశ్ ఆదివారం సమావేశం కానున్న ట్లు తెలుస్తోంది. తన భవిష్యత్తు కార్యాచరణపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ నేతలతో కాలేరు వెంకటేష్ టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. గత నాలుగు రోజులుగా కాలేరు వెంకటేష్ పార్ట కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. మరోవైపు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అందుబాటులో లేకపోవడంతో ఇవాల్టి కేటీఆర్ అంబర్ పేట పర్యటన వాయిదా వేసుకున్నారు. రెండు, మూడు రోజుల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కారు దిగి కాంగ్రెస్‌లోకి వెళ్తారనే ప్రచారం జరుగుతోంది.

## బీఆర్ఎస్‌కు వరుస షాక్‌లు

**– కాంగ్రెస్ ఖాతాలో పడ్డ కామారెడ్డి మున్సిపాలిటీ**

**నేటి ఫోకస్ న్యూస్, కామారెడ్డి-మార్చి30:**

తెలంగాణలో బీఆర్ఎస్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఓ వైపు సీనియర్లు పార్టీని వీడుతుంటే.. మరోవైపు స్థానిక సంస్థల్లో ఆ పార్టీ మరింత బలహీనపడుతుంది. తాజాగా కామారెడ్డి బీఆర్ఎస్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. దీంతో ఆమె ఛైర్ పర్సన్ పదవి కోల్పోయారు. కామారెడ్డి కొత్త మున్సిపల్ ఛైర్ పర్సన్‌గా కాంగ్రెస్ కౌన్సిలర్ గడ్డం ఇందుప్రియ ఎన్నికయ్యారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ జాహ్నవిపై సొంత పార్టీ కౌన్సిలర్లే తిరుగుబాటు చేశారు. అవిశ్వాసానికి పరోక్షంగా 9 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు సహకరించారు. మొత్తం 49 మంది కౌన్సిలర్లకు గానూ, కాంగ్రెస్‌కు 27, బిఆర్ఎస్‌కు 16, బీజేపీకి ఆరుగురు ఉన్నారు. అవిశ్వాస తీర్మానం సమయంలో కోరం సరిపోక పోవడంతో కాంగ్రెస్ కు అనుకూలంగా 9మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు హాజరయ్యారు. బీఆర్ఎస్‌పై అసంతృప్తితో ఉన్న ఈ 9మంది కౌన్సిలర్లు ప్రత్యేక క్యాంపు నుంచి నేరుగా సమావేశానికి హాజరయ్యారు. బలపరీక్షలో జాహ్నవిని ఓడించడానికి ముందుగానే స్కెచ్ వేయగా.. వీరికి బీఆర్ఎస్‌కు చెందిన ముఖ్య నేత అండగా నిలిచినట్లు తెలుస్తోంది. అవిశ్వాసానికి అనుకూలంగా 27 మంది చేతులు ఎత్తడంతో తీర్మానం నెగ్గింది. దీంతో కొత్త ఛైర్మన్‌గా గడ్డం ఇందుప్రియను ఎన్నుకున్నారు. బీజేపీ కౌన్సిలర్లు సమావేశానికి హాజరుకాలేదు. ఇందుప్రియ కామారెడ్డి 8వ వార్డు కౌన్సిలర్‌గా ఉన్నారు. ఆమె అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గడంతో కాంగ్రెస్ కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయం బయట టపాసులు కాల్చి స్వీట్లు పంచుతూ తమ ఆనందాన్ని పంచుకున్నారు.

## ఊసరవెల్లి, పాములకన్నా డేంజర్

- కురువృద్ధులుగా ఉంటూ బిఆర్ఎస్‌కు ద్రోహం
- రాజకీయంగా ఎదిగేలా చేసినా పార్టీకి ద్రోహం
- చెడ్డీ గ్యాంగులా..పార్టీ మారే గ్యాంగు ఇది
- కెకె, కడియంలపై ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శలు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి30:**

పార్టీ వీడిన కే కేశవరావు, కడియం శ్రీహరి.. ఊసరవెల్లి, పాము లాంటోళ్లు అని బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ తీవ్ర విమర్శలు చేశారు. ఊసరవెల్లి ప్రమాదంలో ఉన్నప్పుడు మాత్రమే రంగులు మారుస్తదట. పాము గడ్డు సమయంలోనే తనను ఎవరైనా కొట్టి చంపుతారని అనుకున్నప్పుడు అది పడగ విప్పి కాటేస్తదట. కేకే, కడియం ఈ రెండింటి కంటే ప్రమాదకరం అని ఎర్రోళ్ల శ్రీనివాస్ ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఎర్రోళ్ల శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. కురు వృద్ధులైన కేకే, కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీలో అనేక పదవులు అనుభవించి, అవకాశాలు పొంది ఇవాళ పార్టీ మారుతుంటే సిగ్గు అనిపిస్తుంది. ఎందుకంటే రాజకీయాల్లో వెంటిలేటర్ మీద ఉన్న వీళ్లకు కేసీఆర్ ఆక్సిజన్ ఇచ్చి బతికించుండు. కాంగ్రెస్, టీడీపీలో ఉన్న ఈ లీడర్లకు ఏముండే. కడియం శ్రీహరిని 2014లో వరంగల్ ఎంపీని చేశాం. 2016లో ఎమ్మెల్సీని చేసి డిప్యూటీ సీఎం ఇచ్చాం. అదే విధంగా 2021లో ఎమ్మెల్సీ రెన్యువల్ చేశాం. 2023లో ఎమ్మెల్యేను చేశాం. అది కూడా ఎమ్మెల్సీ పదవి కాలం నాలుగేండ్లు ఉన్నప్పటికీ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి కేసీఆర్ గెలిపించారని అన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేను వదిలేసి కడియం శ్రీహరికి కేసీఆర్ అవకాశం ఇచ్చారు. నా బిడ్డకు టికెట్ కావాలంటే వరంగల్ ఎంపీ టికెట్ ప్రకటించారు కేసీఆర్. ఇవాళ గమ్మత్తు ఏంటంటే.. రాజకీయాలకు విలువలు ఉన్నాయా..? అనిపిస్తుంది. మార్చి 27న కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు కడియం కావ్య. 28న సాయంత్రం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఉత్తరం రాశారు అని ఎర్రోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదన్నారు. కడియం శ్రీహరి తన 50 ఏండ్ల రాజకీయ సీనియారిటిని ఈ చిల్లర రాజకీయం కోసం వాడుకున్నారని అనిపిస్తుంది. కడియం కావ్యకు ఎంపీ టికెట్ ఇవ్వడంతో.. రాజయ్య, ఆరూరి రమేశ్, పసునూరి దయాకర్ పార్టీకి దూరమయ్యారు. కడియం వల్ల ముగ్గురి వ్యక్తులను కోల్పోయాం. అయినా ఇవాళ పార్టీని డ్యామేజ్ చేశారు. కేసీఆర్‌ను పూర్తిగా మోసం చేశారు. ఇది విలువల్లేని రాజకీయం. ఒక పక్కా ప్రణాళిక ప్రకారం కడియం పార్టీ మారారు. ఇది బ్లాక్ మెయిల్ రాజకీయం. వీళ్లను పవర్ బ్రోకర్లు అనాలా..? రియల్ బ్రోకర్లు అనాలా..? అర్థం కావడం లేదు. తెలంగాణ ఉద్యమం నుంచి ఎదిగి వచ్చిన నాయకులం మేం. తెలంగాణ కోసం వ్యక్తిగత జీవితాలను త్యాగం చేసి, ప్రజా సేవ కోసం పాటుపడాలని కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తున్నాం. మీలాంటి వాళ్ల కోసం ఎన్నో త్యాగాలు చేశాం. మేం త్యాగాలు చేసి మీకు పదవులు అప్పజెప్తే.. మీరేమో భోగాలు అనుభవించి ఇప్పుడు పార్టీని తిడుతున్నారు. ఇది సరికాదు. ఇవాళ మీ వల్ల వరంగల్ జిల్లాలో ఎంతో నష్టం జరిగిందని ఎర్రోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇకపోతే ఇవాళ తెలంగాణలో తెలుగు దేశం మాస్కు వేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తున్నదని ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్నది రాజకీయ పునరేకీకరణ కాదు. పాత తెలుగు తమ్ముళ్ల పునరేకీకరణ.. వారంతా ఒక వేదిక మీదకు వస్తున్నారు. కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని చంద్రబాబు డైరెక్షన్‌లో ఈ చేరికలు నడుస్తున్నాయి. పోరాటాలు, ఉద్యమాలు, కేసులు బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు కొత్తకాదు. భయపడేది లేదు అని ఎర్రోళ్ల శ్రీనివాస్ తేల్చిచెప్పారు.

## పార్టీకి నష్టం చేసిన వారిని వదిలిపెట్టేది లేదు..

- వడ్డీతో సహా బదులు తీర్చుకుంటాం: ఎమ్మెల్యే హరీశ్‌రావు
- ఆరు నెలలు ఓపిక పట్టండి, భవిష్యత్ మనదే
- వంద రోజుల పాలనలో కాంగ్రెస్ ఒరగబెట్టిందేమీ లేదు
- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశం



**నేటి ఫోకస్ న్యూస్, గజ్వేల్-మార్చి 30:**

పార్టీకి నష్టం చేసిన వారిని వదిలిపెట్టేదిలేదని, అన్ని లెక్కలు రాసి పెడుతున్నామని వడ్డీతో సహా బదులు తీర్చుకుంటామని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హెచ్చరించారు. శనివారం సిద్దిపేట జి ల్లా గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయ కుల సమావేశం మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు నెలలు ఓపిక పట్టండి.. భవిష్యత్ మనదే అంటూ నాయకులకు భరోసా ఇచ్చారు. భూకబ్జాలకు పాల్పడిన వారు మాత్రమే ప్రస్తుతం పార్టీ మారుతున్నారని దుయ్యబట్టారు. వంద రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రజలకు ఒరగబెట్టిందేమీలేదని ఆరోపించారు. ప్రభుత్వ విధానాల వల్ల ఆర్టీసీ, పౌరసరఫరాల కార్పొరేషన్లు దివాళా తీయడం ఖాయమన్నారు. పింఛన్ రూ.4వేలకు పెంపు, రైతు బంధు రూ.15వేలకు పెంపు, వ్యవసాయకూలీలకు రూ.12వేలు ఏమయ్యాయని ప్రశ్నించారు. గజ్వేల్ నియోజకవర్గానికి బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.150 కోట్ల పనులను రద్దు చేశారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక పెద్దగా చేసిందేమీ లేకుండా ఎంపీ ఎన్నికల్లో ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. దుబ్బాకలో మోసం చేస్తే బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును బండకేసి కొట్టారని చెప్పారు. గజ్వేల్‌పై కేసీఆర్‌కు ఉన్న ప్రేమ రఘునందన్‌కు ఎలా ఉంటుందో మీరే ఆలోచించుకోవాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రఘునందన్‌పై గ్రామస్థాయిలో చర్చ పెట్టాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 2న గజ్వేల్‌లో నియోజకవర్గస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపుపై కార్యాచరణ రూపొందించుకుందామని చెప్పారు. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏడున్నరేళ్లు జాయింట్ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా పనిచేసే అవకాశం కల్పించిన మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావును ఎప్పటికీ మరిచిపోనని చెప్పారు. రూ.100 కోట్లతో స్థాపించాలనుకుంటున్న పీవీఆర్ ట్రస్టు ద్వారా కార్యకర్తల పిల్లలకు విస్తృతంగా విద్యావకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎఫ్‌డీసీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పదవులు అనుభవించిన వారే పార్టీలు మారుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, గజ్వేల్%--%ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్‌సీ రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

## ఎవరు వెళ్లినా బీఆర్ఎస్‌కు నష్టం లేదు

- పార్టీలో గట్టి కార్యకర్తలే మిగిలారు
- కాంగ్రెస్ మాయమాటలకు ప్రజలు మోసపోయారు
- మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి విమర్శలు

**నేటి ఫోకస్ న్యూస్, సంగారెడ్డి-మార్చి30:**

ఎవరు వెళ్లినా బీఆర్ఎస్‌కు నష్టం లేదని.. పార్టీలో ప్రస్తుతం గట్టి కార్యకర్తలు మాత్రమే మిగిలారని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ మంజుశ్రీ రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జహీరాబాద్ పార్లమెంట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ మాయమాటలు నమ్మి ప్రజలు భ్రమతో ఓట్లు వేశారన్నారు. హామీల కోసం ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు ఇబ్బందులుపడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను, చేస్తున్న మోసాలను ప్రజల్లో ప్రచారం చేయాలన్నారు. బీజేపీ పదేళ్ల పాలనలో ప్రజల కోసం ఒక్క పని చేయలేదని.. దేశానికి బీజేపీ చేసింది శూన్యమన్నారు. కులాలు, మతాలను అడ్డం పెట్టుకొని బీజేపీ రాజకీయం చేస్తుందని ఆరోపించారు. ఈడీ, సీబీఐ, ఐటీలను ఉపయోగించి ప్రతిపక్షాలను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఎంపీలు ఉండి జహీరాబాద్ ప్రాంతానికి చేసింది ఏమీ లేదన్నారు. ఎంపీగా ఉండి స్వార్థం కోసమే.. వ్యాపారాలు చేసుకోవడానికి తప్ప ప్రజల కోసం చేసిందేమీ లేదన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యకర్తలు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో పోరాడి గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ వేదికగా జహీరాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. జహీరాబాద్ ప్రాంత ప్రజాల గొంతుకనై పోరాడుతానన్నారు.

## ఉద్యోగావకాశాలకు పటిష్ఠ చర్యలు

- కాంగ్రెస్ రోజ్‌గార్ క్రాంతితో పక్కా ప్రణాళిక
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మార్చి30:**

కాంగ్రెస్ పార్టీ 'రోజ్‌గార్ క్రాంతి తీసుకువస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శనివారం ప్రకటించారు. యువతకు ఉద్యోగావకాశాలు పెంచేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటుందని, వారి ఆకాంక్షల సాఫల్యానికి, పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సాహానికి పార్టీ ఈ పథకం ద్వారా కృషి చేస్తుందని ఖర్గే హామీ ఇచ్చారు. కాంగ్రెస్ గ్యారంటీలతో యువత భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందని ఆయన చెప్పారు. పార్టీ అధికారంలోకి వచ్చిన పక్షంలో'యువ న్యాయ్' గ్యారంటీలను అమలు పరుస్తుందని ఖర్గే పునరుద్ఘాటించారు. 'కాంగ్రెస్ పార్టీ యువ న్యాయ్ గ్యారంటీ ద్వారా 'రోజ్‌గార్ క్రాంతి' తీసుకువస్తుంది. మన యువతకు ఉద్యోగావకాశాలు పెంపుదలకు, పరిశ్రమల స్థాపన దిశగా ప్రోత్సాహానికి, వారి కలలు, ఆకాంక్షల సాఫల్యానికి మేము పటిష్ఠమైన చర్యలు తీసుకుంటాం' అని ఖర్గే 'ఎక్స్'చ పోస్ట్‌లో హామీ ఇచ్చారు. 'యువ న్యాయ్' పథకం కింద పార్టీ ఇవ్వనున్న గ్యారంటీలను ఖర్గే వివరించారు. 'భారతీ భరోసా' గ్యారంటీ కింద తమ పార్టీ జాబ్ క్యాలెండర్ ప్రకారం 30 లక్షల కొత్త కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు కల్పిస్తుందని, 'పెహ్లీ నౌకీ పక్కీ'లో భాగంగా ఏడాదికి ఒక లక్ష రూపాయలు వంతున విద్యాధిక యువజనులు అందరికీ ఒక ఏడాది అప్రెంటిస్‌షిప్ హక్కు కల్పిస్తుందని ఖర్గే తెలియజేశారు. 'పేపర్ లీక్ సే ముక్తి' గ్యారంటీ కింద పార్టీ అన్ని పేపర్ల లీక్‌లను పూర్తిగా కట్టడి చేయడానికి ఒక చట్టం చేస్తుందని పార్టీ అధ్యక్షుడు తెలిపారు. జిగ్ కార్మికులకు మెరుగైన పని పరిస్థితులు, సామాజిక భద్రత కల్పిస్తుందని, యువత కోసం రూ. 5000 కోట్ల స్టార్టప్ నిధి ఏర్పాటు చేస్తుందని ఖర్గే తెలియజేశారు. ఐదు న్యాయ్‌లు / నారీ న్యాయ్, యువ న్యాయ్, శ్రామిక్ న్యాయ్, కిసాన్ న్యాయ్, హిస్సేదారి న్యాయ్ కింద 25 గ్యారంటీలతో లోక్‌సభ ఎన్నికలలో ప్రచారానికి కాంగ్రెస్ వ్యూహం రూపొందించింది. అధికారంలోకి వచ్చినట్లయితే వాటిని అమలు చేస్తామని పార్టీ వాగ్దానం చేసింది.



## ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు

**నాగర్ కర్నూల్ ప్రతినిధి, జయశంకర్ నేటి ఫోకస్ మార్చ్ 30:**

ఈ నెల 18 నుంచి ప్రారంభమైన పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం ముగిశాయని డీఈఓ గోవిందరాజులు తెలిపారు. జిల్లాలోని 250 పాఠశాలల్లో చదువుతున్న మొత్తం 10528 మంది విద్యార్థులు జిల్లావ్యాప్తంగా ఏర్పాటుచేసిన 59 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాశారు. జిల్లాలో 10 పరీక్షలు ప్రారంభం నుంచి చివరి వరకు ఎలాంటి అటుపోట్లకు తావు లేకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడం జరిగిందని, డీఈవో తెలిపారు. పదో తరగతి పరీక్షల చివరి రోజు శనివారం సోషల్ పరీక్షకు 10503 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 25మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని డీఈఓ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా పరీక్షలను నిర్వహించిన చీఫ్ సూపరింటెండెంట్ లు, డిపార్ట్మెంటల్ అధికారులు, 10 పరీక్షల్లో పాల్గొన్న అధికారులు, సహకరించిన పోలీస్ మరియు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పరీక్షలు ముగియడంలో నాగర్ కర్నూల్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు ముగియడంతో విద్యార్థులు పరీక్ష కేంద్రం నుండి హుషారుగా తమ ఇళ్లకు పయనమయ్యారు.



## పాలనపై సోయిలేని సిఎం రేవంత్

- పంటలు ఎండిపోయి రైతులు ఏడుస్తున్నా పట్టింపేది
- కెసిఆర్ సిఎంగా ఉంటే..ఈ కష్టం వచ్చేదా
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శలు

**నేటి ఫోకస్ న్యూస్, నల్లగొండ-మార్చి30:**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలనపై సోయి లేదని మాజీ మంత్రి, సూర్యాపేట బిఆర్ఎస్ జగదీశ్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. పంటలు ఎండిపోయి రైతులు అల్లాడుతుంటే కనీసం సమీక్ష కూడా చేయడం లేదన్నారు. ఇదేనా పాలన అంటే అని విమర్శించారు. నల్గొండ జిల్లా కేంద్రంలో జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎంపీ లింగయ్య యాదవ్, ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ఆదివారం నల్లగొండ జిల్లాలో పర్యటిస్తారని తెలిపారు. ఉదయం 9గంటలకు బయలుదేరి భువనగిరి మీదుగా జనగామ వెళ్తారన్నారు. మొదట దేవరప్పులలో ఎండిన పంటలను పరిశీలిస్తారని చెప్పారు. ఆ తర్వాత సూర్యాపేట జిల్లాలోని అర్వపల్లి, తుంగతుర్తి మండలాల్లో ఎండిన పంటలను పరిశీలిస్తారన్నారు. అనంతరం సూర్యాపేట పట్టణంలోని జనగామ రోడ్‌లోని పంటలను పరిశీలిస్తారన్నారు. సూర్యాపేటలో మీడిఆయాతో మాట్లాడుతారని అన్నారు. అక్కడి నుంచి హాలియా, మిర్యాలగూడ రోడ్ పక్కన ఉన్న సాగర్ ఆయకట్టులో ఎండిన పొలాలను పరిశీలించి.. హైదరాబాద్ కు బయలుదేరుతారన్నారు. ఆరోగ్యం బాగా లేకున్నా రైతుల కష్టాలు చూడలేక కేసీఆర్ ఆదివారం అన్నదాతల వద్దకు వస్తున్నారన్నారు. రేవంత్‌కి పరిపాలనపై సోయిలేదని.. ఇప్పటివరకు వ్యవసాయంపై సమీక్ష లేదని.. మంత్రి కూడా సమీక్ష చేయలేదరన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కేసీఆర్ ఉంటే భూమి ఆకాశనీ ఒక్కటి చేసైనా సరే అన్నదాతలకు నీళ్లు అందించేవారన్నారు. కానీ, ఇవాళ దరిద్రమైన ప్రభుత్వం ఉన్నదన్నారు. రాష్ట్రంలో నీళ్లు అందక లక్షల ఎకరాలు ఎండిపోయా యని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు మొర పెట్టుకున్నా ప్రభుత్వంలో కదలిక లేదన్నారు. నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నా ఇవ్వలేదని.. ప్రభుత్వం నిర్లక్ష్యంతో అన్నదాతలు ఆగం అయ్యారన్నారు. ÷ళిసీఆర్‌పై కోపంతో రైతులను బలి పెట్టారు కాంగ్రెస్ వాళ్లు.. సాగర్‌లో డెడ్ స్టోరేజ్ నీళ్లు ఉన్నా అప్పుడు నీళ్లు అందించామన్నారు. అన్నదాతలను కాపాడుకున్నామని.. కానీ, ఇప్పుడు పట్టించుకునే నాథుడే లేడని.. ఎస్సారెస్పీ కింద సూర్యాపేట జిల్లాలో నీళ్లు ఇస్తామన్నారు. పంటలు సాగు చేయండని చెప్పి మరి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. నీళ్లు ఇవ్వక ఎక్కడికక్కడ ఎండిపోయాయని అన్నారు. జిల్లా మంత్రులు అక్రమ వసూళ్లు, దందాలు మొదలుపెట్టారని మండిపడ్డారు. మిల్లర్లను బెదిరింపు చేసి కోట్లు వసూలు చేశారని.. మిల్లర్లు ఏమో అన్నదాతలను పీక్కొని తింటున్నరని విమర్శించారు. కోమటిరెడ్డి ఓ బడ్డారఖాన్.. ఓ జోకర్.. ఆయన మాటలకు ఎక్కడ విలువ లేదన్నారు. ఎంపీ లింగయ్య యాదవ్ రేవంత్ రెడ్డి సీఎం ఉడడం లేదన్నారు. దౌర్భాగ్యం జిల్లాలో నష్టపోయిన రైతులకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం మెడలు వంచుతామన్నారు. కేసీఆర్ జిల్లాలో పర్యటిస్తున్నారని, రైతుల అండగా ఉంటారన్నారు. పరిపాలన చేతకాక రేవంత్ అడ్డగోలుగా ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు. ప్రజలు కాంగ్రెస్ నయవంచనను అర్థం చేసుకోవాలని కోరారు. రేపటి ఎన్నికల్లో ప్రజలు నిలదీస్తే సమస్యలు తెలుస్తాయని అన్నారు. రైతులకు ఏం సమాధానం చెబుతారో చూస్తామని అన్నారు.


ఫోకస్ న్యూస్



# హనుమాన్ ఓ అద్భుతం..



**ఈ ఏడాది సంక్రాంతి బరిలో** విజేతగా నిలిచి అద్భుతమైన వసూళ్లు సాధించిన 'హనుమాన్' చిత్రంపై రచయిత పరుచూరి గోపాలకృష్ణ ప్రశంసలు కురిపించారు. చిత్రంలో పాలాళభైరవి ప్రభావం ఉందని అన్నారు. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తేజ సజ్జా హీరోగా తెరకెక్కిన ఈ సినిమాలో ఓపెనింగ్ సన్నివేశంలోని ట్విస్ట్‌ను చివర్లో చూపించారని.. దాన్ని ఎవరూ ఊహించలేదన్నారు. 'హనుమాన్'ను చక్కగా తెరకెక్కించారు. ఆయన గొప్ప దైవభక్తుడు. అలాంటి ఆయన సాయంతోనే రాముడు.. సీతమ్మను లంక నుంచి విడిపించుకున్నాడు. ఈ సినిమా చూసేటప్పుడు పురాణాలన్నీ మన మనసులో మెదులుతూ ఉంటాయి. ఎన్టీఆర్ హీరోగా వచ్చిన 'పాతాళ భైరవి' స్ఫూర్తి ఇందులో కొన్ని పాత్రల్లో కనిపించింది. ఆ సినిమా స్ఫూర్తితో రూపొందించిన హనుమంతుడి కథే 'హనుమాన్'. చిన్న పిల్లాడు పెద్ద విలన్‌లను పడగొట్టినట్లు చూపించడం బాగుండదు కాబట్టి ఆ అబ్బాయికి దైవశక్తి తోడున్నట్లు చూపించారు. 'పాతాళభైరవి' సినిమాను ఎన్టీఆర్‌తో తీయడానికి అందరూ భయపడ్డారు. కానీ, ఇప్పుడు 'హనుమాన్'ను తేజ సజ్జాతో తీసేందుకు ప్రశాంత్‌వర్మ భయపడలేదు. అతడి ధైర్యానికి హ్యాట్సాఫ్. తన స్క్రీన్‌ప్లేపై అంత నమ్మకం పెట్టుకున్నారు. ఓపెనింగ్‌లో హీరోను చిలిపి పనులు చేసే కుర్రాడిలా చూపించడం దర్శకుడి తెలివితేటలకు నిదర్శనం. ఒక సన్నివేశంలో హీరో తన చేతులతో కొండను ఎత్తుతాడు.. అప్పుడు గోవర్ధన గిరి ఎత్తిన శ్రీకృష్ణుడిలా కనిపిస్తాడు. కొండంత బలమున్న ఈ సినిమా కథను కూడా తేజసజ్జా తన భుజాలపై వేసుకున్నాడు. అతడిని ప్రశాంత్ వర్మ విజయంవైపు నడిపించారు. ఈ సినిమా క్రెడిట్స్ ఎక్కువ శాతం దర్శకుడికే వెళ్తాయి. పురాణాల్లోని పాత్రలన్నీ మన మనసుల్లో నిండిపోయాయి. వాటిని మనమంతా విశ్వసిస్తాం. ఆ విశ్వాసమే ప్రశాంత్ వర్మ 'హనుమాన్' తీయడానికి కారణమైంది. ఆయన్ని నమ్మిన నిర్మాతలను కూడా మెచ్చుకోవాలి. సినిమా విజయం అందులోని సన్నివేశాలపై ఆధారపడి ఉంటుంది. ఏ సీన్ తర్వాత ఏది రావాలనేది తెలిసి ఉండాలి. లేదంటే కష్టం. ఇందులోని ఎన్నో సన్నివేశాలను దర్శకుడు తెలివిగా ముగించారు. అక్కాతమ్ముళ్ల అనుబంధం కూడా అద్భుతం. అక్క పాత్రకు ఇచ్చిన ముగింపు నేను ఊహించలేదు. దేవుడి కోసం ఈ కథను చూపిస్తున్నాడు అనుకునే సమయానికి పగ, ప్రతీకారాలను చూపించారు. అలా చూపించడం డైరెక్టర్ తెలివితేటలే. చిన్న హీరోతో పెద్ద కథను నడిపిస్తున్నా అని ఆయన అనుక్షణం గుర్తుపెట్టుకున్నారు. చివరి అరగంట ఉత్కంఠభరితంగా ఉంది.




## వేణు శ్రీరామ్ దర్శకత్వంలో

# నితిన్ కొత్త సినిమా

హీరో నితిన్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులతో పాటు సినీ ప్రముఖులు నితిన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అయితే నితిన్ బర్త్ డే సందర్భంగా తాను నటిస్తున్న కొత్త ప్రాజెక్ట్ నుంచి టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమా తమ్ముడు అనే టైటిల్‌తో వస్తుండగా.. ఈ చిత్రానికి 'వకీల్ సాబ్' ఫేమ్ వేణు శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇక తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్, టైటిల్ లోగో విడుదలైంది. ఇక ఈ పోస్టర్‌లో నితిన్ మాస్ లుక్‌లో అదరగొడుతున్నాడు. ఇక ఈ పోస్టర్ గమనిస్తే.. నితిన్ బస్‌పై కూర్చొని సుబ్రమణ్య స్వామి ఆయుధం పట్టుకుని కనిపిస్తున్నాడు. ఇక నితిన్ గత చిత్రాలకు భిన్నంగా.. చాలా క్రియేటివ్‌గా ఇ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కాంతార, విరూపాక్ష చిత్రాల సంగీత దర్శకుడు అజనీష్ లోక్‌నాథ్ ఈ చిత్రానికి మ్యూజిక్ అందిస్తుండగా.. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నాడు.

# నితిన్, వెంకీ కుడుముల కాంబో

## బర్త్‌డే సందర్భంగా పోస్టర్ విడుదల

టాలీవుడ్ హీరో నితిన్, వెంకీ కుడుముల కాంబోలో వస్తున్న తాజా చిత్రం రాబిన్‌హుడ్. భీష్మ సినిమా తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అయితే నితిన్ పుట్టినరోజు కావడంతో మూవీ నుంచి స్పెషల్ బర్త్‌డే విషెస్ తెలిపారు మేకర్స్. ఈ సినిమా నుంచి నితిన్‌కు బర్త్‌డే విషెస్ తెలుపుతూ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. ఇక ఈ పోస్టర్‌లో నితిన్ కమాండర్ గెటప్‌లో మాస్ లుక్‌లో అలరిస్తున్నాడు. అయితే నితిన్ ఈ సినిమాలో దొంగగా కనిపించబోతున్నాడు. నటకిరిటీ రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్ ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యేర్నేని, రవి శంకర్ నిర్మిస్తున్నారు.



## వేసవి ఆటవిడుపు.. విదేశాలకు

# చరణ్ దంపతులు

తెలుగు చిత్ర పరిశ్రమకి కూడా వేసవి తాపం బాగా ఎక్కువైంది. అందుకే కథానాయకులు అందరూ ఈ వేసవి తాపం తట్టుకోవటానికి విదేశాలు విశ్రాంతి కోసం వెళుతున్నారు. ఇప్పుడు రామ్ చరణ్ కూడా అదే దారిలో విదేశాలకి తన స్పెషల్ విమానంలో బయలుదేరారు. ఇదే విషయాన్ని అతను తన చిత్రం ద్వారా చెప్పారు. తనకున్న ప్రత్యేక విమానంలో తన సీటుపై తన పెట్ డాగ్ కూర్చుని ఉంటే, రామ్ చరణ్ అదే సీటు అంచున కూర్చొని బయటకి చూస్తున్నారు ఆ చిత్రంలో. 27న పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న రామ్ చరణ్ ఆరోజు ఎంతో బిజీగా గడిపారు. అదేరోజు తెల్లవారుజామున తిరుపతి వెళ్లి వేంకటేశ్వరస్వామి సన్నిధిలో కుటుంబంతో సహా దర్శనం చేసుకొని అదే రోజు ఉదయం హైదరాబాదు చేరుకున్నారు. ఇక అక్కడ నుండి అభిమానులు రామ్ చరణ్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పడానికి విచ్చేస్తూనే వున్నారు.అంతకు ముందు రామ్ చరణ్, శంకర్ దర్శకత్వంలో వస్తున్న 'గేమ్ చేంజర్' సినిమా విశాఖపట్నంలో చిత్రీకరణలో పాల్గొన్నారు. ఇలా వరసగా తీరిక లేకుండా పని చేస్తూ ఇప్పుడు చిత్రీకరణకు కొంత విరామం ప్రకటించి విశ్రాంతి కోసమని విదేశాలకి పయనం అయ్యారు. రామ్ చరణ్ థాయిలాండ్ వెళుతున్నట్టుగా తెలిసింది. శంకర్ తో చేస్తున్న 'గేమ్ చేంజర్' సినిమా ఇప్పటికే బాగా ఆలస్యం అయిందని అంటున్నారు. దిల్ రాజు ఈ సినిమాకి నిర్మాత. అయితే రామ్ చరణ్ కొన్ని రోజులు విశ్రాంతి తీసుకొని తిరిగి వచ్చి ఆ సినిమా చిత్రీకరణ పూర్తయ్యేవరకు పాల్గొంటారని తెలిసింది. తరువాత రామ్ చరణ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో చెయ్యవలసిన సినిమా చిత్రీకరణలో పాల్గొంటారు.